మత్తవిలాసము

(మహేంద్రవిక్రమవర్మకృతికి తెనుఁగు)

అనువాద -

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

౧౯౩౫

(చంద్రికను పునర్ముద్రిత

w-Huu
22-168

తొలిపలుకు

మత్తవిలాస మను పేరు గల ప్రహసన మిది. మహేంద్రవిక్రమమవర్మ యని పేరెన్నికగన్న పల్లవమహారాజు (క్రీ. శ. ౭-వశతాబ్ది పూర్వభాగము రాజ్య మేలినవాడు) రచించినది. ఇప్పటికి దొరకిన ప్రాచీనసంస్కృతప్రహసనములలో నిది రెండవది. తొల్తటిది భగవదజ్జుకము. దానికంటె నిది సర్వవిధములను దర్వాతిదే. భగవదజ్జుకము బోధాయన ప్రణీతముగాఁ గానవచ్చుచున్నది. కాని యదికూడ నీ మహేంద్రవిక్రమవర్మ యాస్థానిలో రచితమయ్యేనేమో యని యనుమానించుటకు సాధనలేశము లున్నవి. ఈ ప్రహసనములోని శ్లోకమును—

"పేయానురాగ్రప్రియతమాముఖమీక్షితవ్యం।
గ్రాహ్యా స్వభావలలితోఽవికృతశ్చ వేషః।
కే, నేద మీదృశ మదృశ్యత మోక్షవర్త్మ।
దీర్ఘాయురస్తు భగవాన్ స పినాకపాణిః॥"

అనుదానిని యశస్తిలక చంపువులో సోమదేవసూరి (క్రీ.శ. ౯౬౦ నాఁటివాఁడు) భాసరచితముఁగా బేర్కొనియున్నాఁడు. (౨ భా. ౫ ఆశ్వాసము, నిర్ణయసాగరప్రతి, పుట ౨౫౧.) బౌద్ధ కాపాలిక పాశుపత మతముల వారి యసభ్యవర్తనము లిందుఁ బ్రదర్శింపఁబడినవి. ఏతత్ప్రహసన రచనాకాలమున నా మతములవారి కట్టి యవనతగతి కలిగియుండ వచ్చును. ఉపనిషత్తులు, భారతము, బ్రాహ్మణులు, కాంచీపురి, రాజకులికులు, ఇందు పేర్కొనఁబడిరి.

కాంచీపురము వైభవ మిందుఁ గొంత వర్ణిత మయినది. అక్కడ 'రాజవిహార'మని

యొక బౌద్ధ విహారము ధనదాససెట్టి యను వాఁడు వెలయించినది కలదని, ఏకామ్రము (ఒంటి మామిడి) కలదని, పూర్వస్థలీ నివాసి యీశ్వరుఁడు కలఁడని యిందుఁ జెప్పఁబడినది.

చిత్రకలాకుశలుఁడును బహు ప్రఖ్యాతుఁడు నగు మహారాజు రచించినదన్న గౌరవమును బట్టి చరిత్రోపయుక్తమగునన్న యాశనుబట్టి చిరకాలమునకు ముందె దీనిని నేను దెలిఁగించితిని. ఇదికూడ భగవదజ్జుకముతోపాటు వెలయఁదగినదే యన్నతలఁపున నిపుడు ప్రకటించితిని.

వేటూరి ప్రభాకరశాస్త్రి

సవరణలు

పుట	పంక్తి	సవరణ
20.	15	అవును; వీతరాగుడవయితివా వీత రోషుడవూ కావలసినదే !
25.	16	స్వామీ! ఈ భిక్షాపాత్రమును చూడవెందుచేత? చెప్పవయ్యా దీని రంగేమిటో ?
28.	11	... ... చక్కగా-అనేక విహారాల్లో భోగభాగ్యా లనుభవిస్తూ ...
29.	16	... ఊరబండి నెక్కి-

మత్తవిలాసము

మహేంద్రవిక్రమవర్మ ప్రణీతమునకు

తెనుఁగు.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును.)

సీ. ఆకార వేష భాషా కార్య గుణముల
వలన నెన్నె భేదములు ఘటిల్ల,
వానిచే వివిధ భావావేశములు గల్గ,
బహురసాస్పదముగాఁ బరగుచున్న
త్రైలోక్యవర్తనాత్మకమా నఖండన
ర్తనమహోత్సవము నిరంతరాయ
మగునట్లుబోధమాహాత్మ్యాభిరాముఁడై
నిర్వహించుచుఁదానె సర్వమునకుఁ
గడఁగిమరలఁ బ్రేక్షకత్వమ్మువహియించి
యోలగించు నా కపాలపాణి

భవ్య మవనిభాజనవ్యాప్తమగు యశ
మెపుడు మీ కనుగ్రహించుగాత !

ఓహో ! సవతియని నా చిన్న పెండ్లము మీఁద ద్వేషము పెట్టుకొన్న నా పెద్ద పెండ్లమును సంతోష పఱుచుటకుఁ జక్కని సందర్భ మిప్పుడు నాకు సమ కూరినది. ఏమనఁగా, నిన్నాళ్లకు మన్ము పారిషదులు నాటక ప్రయోగాధికారమున నియోగించిరి. కనుక నిఁక నా పెద్ద పెండ్లమును జేరఁబోయెదను. (నేప థ్యాభిముఖుఁడుగాఁ జూచి) ఆర్యా ! ఇటురమ్మ.

నటి:—(ప్రవేశించి రోషముతో) ఏమండీ! ఓహో ! ఇదేమిటండీ ! ఇంతకాలానికి, యవ్వనగుణభర మత్త విలాస ప్రహసనాన్ని చూప వచ్చారా యేమిటి ?

సూత్ర:—ఔను, నీ వన్నట్టే.

నటి:—అయితే ఆవిడతోటే ప్రదర్శించుకోండి, మీతో అన్నట్లూ నుచ్చట్లూ ఆడవలసింది ఆకేగాదా !

సూత్ర:—నీతోఁగూడి ప్రదర్శింపవలె నని నా కోరిక.

నటి:—అయితే నాతోఁగూడి ప్రదర్శించడానికి ఆమే అనుజ్ఞయిచ్చిందా యేమిటి మీకు ?

సూత్ర:—ఔను నిజమే. మఱి కూడ నీ పక్క డికిఁ జేరెదవేని గొప్ప యనుగ్రహమునుం బొందఁ గలవు.

నటి:—అటువంటివి మీరేగదా పొందదగ్గవారు!

సూత్ర:—భవతీ! నీవు మాత్ర మేల పొందఁ దగవు? నీ ప్రయోగచాతుర్యము జూచి పరితోషించి పారిషదులు ని న్ననుగ్రహింతురంటిని!

నటి:—(సహర్షముగా) ఆలాగా! అయితే సరి! ఇప్పటికి నాకు ఆర్యమిశ్రుల ప్రసాదము లభించింది.

సూత్ర:—లెస్సగా లభించినది

నటి:—అయితే ఇక నిప్పుడు ప్రియవార్త చెప్పినందుకు మీకు ఏమి బహుమానం ఇచ్చుకొనేది?

సూత్ర:—ప్రియాఖ్యాన బహుమానమును గూర్చి పౌనరుక్త్యమేల? చాలు! చూడు!

ఉ. భామిని! చెక్కుటద్దముల
పైఁ బులకల్ మొలకెత్తెఁ, గన్బొమల్
వామములై రహించె, జిగి
వాతెఱపై నునునవ్వు వెన్నెలల్
ప్రామికొనెన్, సుదుర్లభపు
భాగ్యము నాకిటువంటి నీదు నె

మోక్షము లభించెఁజెందఁదగు
భోగ్యము నాకిఁక నేమికర్తేషీ.

నటి:—అయితే తమరిప్పుడు ఆడవలసిందేమిటి ?

సూత్ర:—నీవే పేర్కొంటివిగదా ! 'మత్తవిలాస ప్రహసన' మని ;

నటి:—నిజంగా ! నా కోపానికి తమరి మీద పక్షపాతం ఉన్నదిసుమండీ ! ఏమంటే మీ అభిప్రాయానికి అనుగుణంగానే నా కోపం నన్ను మాటాడించింది. ఔనండీ ! కవీశ్వరుఁ డెవరు ఆ కృతి రచించి ప్రశస్తి కెక్కినవాడు ?

సూత్ర:—భగవతి ! వినుము. పల్లవకుల ధరణీ మండల కులపర్వతమును, సర్వ నయ విజితసమస్త సామంత మండలుఁడును, ఆఖండలసమ పరాక్రమ సంపన్నుఁడును, సంపన్మహిమానురూప దాన వైభవ పరిభూత రాజరాజును, నగు శ్రీ సింహవిష్ణువర్మకు పుత్త్రుఁడు శత్రుషడ్వర్గ నిగ్రహపరుఁడు పరహిత పరతంత్రతచే మహాభూత సమానధర్ముఁడు మహేంద్ర విక్రమవర్మ యని మహారాజు కలఁడు. మఱియు

శా. కాంతిప్రౌఢి వితీర్ణి సూనృత కలా
కౌశల్య దాక్షిణ్యాది

క్రాంతిశాంత్యనుభావముఖ్యగుణముల్
కా లిక్కలిఁ నిల్ప నే
ప్రాంతఁ గానక యుత్తమై శరణ మా
భూపాలునిం జెందెఁ గ
ల్పాంతంబం దఖిలాదిసీశ్వరుని న
య్యైస్పృష్టి గన్నట్లుగాఁ.

ఇంకను,

క. ఘన సుగుణ సూక్తి మణి గణ
ఖనియయ్యునతండువిలువగల్పించుఁజుమీ
తనయొద్ద లఘుగుణములై
నను సుజనులసూక్తులకుఘనఁబగు పేర్మిఁ

నటి:—తమ రిప్పుడు జాగు చేస్తా రెందుకు ? సరిక్రొత్తది గాబట్టి యీ ప్రయోగాన్ని వెంటనే సాగించవలెను.

సూత్ర:—నేను, సుమా !

తే. సరససంగీతధనుఁడనై సాంప్రతంబు
కవిసుగుణకీర్తనముచేతఁ గట్టువడితి

(నేపథ్యమున) ప్రియా ! దేవసేనా !

సూత్ర:—చెలియతోఁగూడ మద్యమున్నఁ
చేత నిటక

పాల విభవుండయిన యీ కపాలివోలె.

నిష్క్రమించిరి.

ఇది స్థాపన.

(అంత భార్యతో కపాలి ప్రవేశించును.)

కపాలి:—(మత్తునటించి) చెలీ దేవసోమా! సత్యమే సుమాఇది! తపస్సుచేత కామరూపము ధరింపనగున నుట; ఏమనఁగా నీవు యథావిధిగాఁ బరమవ్రతము ననుష్ఠానము చేసితివి. కనుకనే క్షణములో అనన్యమ యిన రూపాతిశయము నందితివి! సీస,

సీ. చెలువారెమోముపైఁ జెమటచిత్తడిజల్లు,
వెల్లువిలాసముల్ వెల్లివిరిసె
భ్రూలతావిభ్రమంబులు వింతలై తోఁచె
నవ్యక్తవర్ణంబు లయ్యెఁ బలుకు
లెట్టిహేతువులేని యట్టహాసము మీఱె
నక్షియుగ్మక మెఱ్ఱనై రహించె
తారకంబు లధీరతరళంబులై పొల్చె
నలసతం బొరసె నపాంగయుగము,

తే. సడలెఁ గ్రుమ్మిడి చిందర్తై సాఁగి రెండు
మూపులంబడి వ్రేలాడె మూర్ధజములు
సరుల పువ్వులు జాఱఁగా సొరుగుదార
మూఁగుచున్నది చాఁగు రే! చాఁగు! బాగు!

దేవసోమ:—స్వామీ! మత్తురాల్నిగా ఉన్మత్తురాల్నిగా నన్ను భావిస్తున్నారు మీరు!

కపాలి:—ఏమంటివి నీవు?

దేవసోమ:—నే నేమీ అనలేదే!

కపాలి:—అయితే నాకు మత్తెక్కెనా యేమి?

దేవసోమ:—సామీ! గిరగిర తిరుగుతోంది, గిరగిర తిరుగుతోంది, పుడమి. ముందుకు పడుతున్నట్టున్నా! పట్టుకోం డిప్పుడు నన్ను;

కపాలి:—చెలీ, అట్లేపట్టుకొనుచున్నాను. (పట్టుకొనుచున్నవాఁడై పతనము నిరూపించి.)

ప్రేయసీ! దేవసోమా! ఏమి నీకు కోపము వచ్చెనా? పట్టుకొనవచ్చుచున్న నన్నుఁ దొలఁగి పోనుచుంటివి?

దేవసోమ:—అవునబ్బో! సోమదేవకు కోపమే వచ్చింది. సామి తలతో దణ్ణంపెట్టి బతిమాలుకుంటున్నా దూరంగానే ఉంటోంది.

కపాలి:—ఓమె ! నీవుగాదటవే సోమదేవవు ? (కనుమూసిచూచి) కాదు దేవసోమవు.

దేవసోమ:—సామీ ! అంత నేస్తకత్తెగామల్లు ఆ సోమదేవ మీకు ; పనికిమాలిన నాపేరితో పేరు కొంటారెందుకు ? అలా పేరుకోకండి ;

కపాలి:—భవతి ! నామత్తు కొంచెం మాట తబ్బిబ్బు చేసినది. అది నీయెడల నిప్పు డపరాధమ యినది.

దేవసోమ:—పోనీండి- మంచిది- అపరాధము మీది గాదు.

కపాలి—ఛీ ! ఏమీ ! మద్యదోషము నన్నిట్లు మార్పు వైచుచున్నదా ! కానీ ! కానీ ! ఇదిమొదలు సేను మద్యనిషేవణము మానివై చెదను.

దేవసోమ:—సామీ ! వద్దు వద్దు. నామూలాన వ్రతభంగం చేసుకుని తపస్సు చెఱుచుకోవద్దు. (పాద ములపైఁ బడును.)

కపాలి:—(సంతోషముతో లేవనెత్తి కౌఁగిలించు కొని.) ధూర్ణ ధూర్ణ ! నమశ్శివాయ, ప్రేయసీ !

మ త్త. కల్లుద్రాగవలెన్, ప్రియాస్యము
గన్గొనన్వలె, సాజమై

చెల్లునట్లు వికారవేషము
    చేకొనకవలె, నంచు ని
ట్లొల్లఁబోవక మోక్షమార్గము
    నొప్పి కన్గొనినట్టివాఁ
డల్లవేల్పు పినాకపాణిచి
    గాయువై జయమందుతన్.

దేవసోమ:—సామీ! ఇట్టా అంటారేమిటి? అర్హా తులు మోక్షమార్గాన్ని వేఱుగా వర్ణిస్తారాయెను?

కపాలి:—ఔనే, వాండ్రు మిథ్యాదృష్టులుగదా! ఏమనఁగా.

తే. కారణగుణంబునిజముగాఁగార్యమునకుఁ
జొప్పడుట హేతువులచేతనొప్పుకొనియు
గ్రుడ్డితుంకలు దమనూట కడ్డముగనె
దుఃఖకార్యంబు సుఖమటందురు మఱియు
[ను;

దేవసోమ:—హరహర! శాంతం పాపమ్.

కపాలి:—శాంతం పాపమ్, ఆక్షేప ముఖమున నైనను ఆ పాపిష్ఠుల పేరెత్తరాదు. వాండ్రు బ్రహ్మచర్యము, కేశముండనము, మలధారణము, భోజ

నవేళా నియమము, మలినవస్త్రపరిధానము మొదలయిన పాడుపనులచే ప్రాణులను బాధించుచుందురు. కాఁబట్టి నేనిప్పుడు కుతీర్థ సంకీర్తనముచే పంకిలమైన నా జిహ్వను మద్యముచేఁ బ్రక్షాళనము చేసికొనఁ గోరుచున్నాఁడను.

దేవసోమ:—అయితే మనమిప్పు డింకో కల్లు దుకాణానికి వెడదాము.

కపాలి:—ప్రేయసీ! అల్లే పోవుదము.

(ఇర్వురును బరిక్రమింతురు.)

కపాలి:—ఓహోహో! ఓహోహో! విమాన శిఖరములపై మబ్బులువిడిసె యుఱుముచున్నవో యన్నట్లు మృదంగములు మ్రోగుచున్నవి. వసంతసమయపుఁ బుట్టుకకుఁ దల్లిపట్లో యనునట్లు పూలయంగళ్లున్నవి. కుసుమశరవిజయ ఘోషణములో యనునట్లు వరాంగనల కాంచీరవము లున్నవి. ఏమి యీ కాంచీపురము వైభవము!

చ. అనతిశయం బనంతమును

నప్రతిబంధమునైన సౌఖ్యముఁ

మునివరు లాత్మబోధపరి
పూర్ణులు ముం దెదిగాఁ దలంచిరో
వనితరో చిత్ర మియ్యెడ న
వారిగ నయ్యది గానవచ్చెడిన్
దనరఁగ గామభోగమయ
తన్ సకలేంద్రియ చర్వణీయతన్.

దేవసోమ:—సామీ! కల్లమ్మువారికి మల్లే యీ కాంచీపురికికూడా మాధుర్యం వెగటులేనిది;

కపాలి:—ప్రేయసీ! చూడు, చూడు, ఈ కల్లు దుకాణము యజ్ఞశాలను బోలి యున్నది. ఇక్కడ జెండాకంబము యూపస్తంభము; సుర సోమము; త్రాగుఁబోతులు బుత్విజులు; త్రావుడుదొప్పలు చమసములు; కలుకుట్లు మొదలయిన నంజుళ్లు హవిర్విశేషములు; కైపుకూఁతలు యజుస్సులు; తందాన పదములు సామగానములు; ఉదంకములు స్రువములు, దాహము అగ్ని; అంగడివాఁడు యజమానుఁడు.

దేవసోమ:—మనకుకూడా ఇక్కడ భిక్షం రుద్రభాగం అవుతుంది.

కపాలి:—ఓహో దర్శనీయములుగదా ఈ మత్తవిలాస నృత్యములు; వీఁడుగో నర్తకులు మద్దెళ్లే దరువు

లకు ఒద్దికగా అనేకవిధములయిన యంగవిక్షేపములు, బొబ్బలార్పులు, బొమ్మమార్పులు నెఱపుచున్నారు. ఒంటిచేతులతో నుత్తరీయములను బైకెత్తి పట్టి యార్పుచున్నారు. కంఠగుణములు కంగారుకాఁగా కట్టుబట్టలు పట్టువీడఁగా సరిపఱుచుకొను సందర్భములందు లయలఁ దప్పుచున్నారు.

దేవసోమః—బలేరసికుఁడు సుమా ఆచార్లు.

కపాలిః—ఇదిగో భగవతి ! మదిర దొప్పలలో దైవాఱుచున్నది. అందచందములకు నలంకారములకు నిది ప్రత్యాదేశము. పాలయలుకలుగొన్న పొత్తుల కిది యనునయము. పడుచుఁదనమున కిది పరాక్రమము. బరవసముల కిది ప్రాణము వేయేల ?

చ. మదనునిమూర్తి, ముక్కుత్రిపుర

మర్దను చిచ్చుఱకంటి మంటచేఁ

బదడయి పాడువాఱె నని

పల్కుదురయ్యది తప్పుఁబల్కు ; నాఁ

డది ద్రవియించె స్నేహమయ

మౌటను దన్నయనాగ్నిసోఁకఁ గా

మదిర యదేసుమా సుదతి !

మత్తిలఁజేయు నొకెత్త చిత్తముల్

దేవసోమ:—స్వామీ! బాగాచెప్పితిరి! లోకో పకారనిరతుడయిన లోకనాథుడు లోకాన్ని వాళ పఱుస్తాడామఱి?

(ఇద్దఱును జెక్కిళ్లు తప్పెటలు వాయింతురు.)

కపాలి:—భవతి! భిక్షాం దేహి!

(నేపథ్యమున.)

సామీ.—ఇదుగో బిచ్చం! పుచ్చుకోండి సాములు!

కపాలి:—ఇదిగో ప్రతిగ్రహించుచున్నాను. ప్రేయసీ! ఎక్కడ నా కపాలము?

దేవసోమ:—నాకూ కనపడలేదు.

కపాలి:—(కనుమూసి యోచించి) ఆఁ! ఆ కల్లు దుకాణముకడనే విడిచి మఱచిపోయితి ననుకొందును. కానీ తిరిగివెళ్లి వెదకుదము.

దేవసోమ:—సామీ! అధర్మం గాదా యిది? ఆదరంతో పెట్టవచ్చిన బిచ్చం అందుకోక పోవడం? ఇప్పు డేమిటి చెయ్యడం?

కపాలి:—ఆపద్ధర్మమును ప్రమాణీకరించి గోవు కొమ్ముతో ప్రతిగ్రహింపఁదగును.

దేవసోమ:—సామీ ఆలాగే. ప్రతిగ్రహించును. (ఇద్దఱు పరిక్రమించి చూతురు.)

కపాలి:—ఇక్కడఁ గూడఁ గానరాకున్నదే! (విషాదము రూపించి) ఓహో! మాహేశ్వరులారా! మాహేశ్వరులారా! మాభిక్షాభాజనము నిక్కడ మీరు చూచితిరా? ఏమంటిరీ మీరు? మేము చూడలే దంటిరా? అయ్యో చెడితిని. నాతపస్సు చెడినది. ఇప్పు డింక నే నెట్లు కపాలిని కాఁగల్గుదును. అయ్యో! దురవస్థ.

ఉ. పానమువేళ దొప్పయయి,
భాజనమై భుజియించువేళ, ని
ద్రానుభవంబువేళ నుపధానమునై,
యిటులింతదాఁక నెం
తే నుపకారముం జలిపె నిట్టి
కపాలముపోక నా కయో
ప్రాణసమానమిత్రు నెడఁబాటు
తెఱంగున వంతగూర్చెడిన్.

(క్రిందబడి తల మోదికొనుట రూపించి) కలము లక్షణమాత్రము! కపాలిసంజ్ఞ నాకుఁ బోలేదు. (లేచును.)

దేవసోమ:—స్వామీ! ఎవరూ మీకపాలాన్నె త్తుకుపోయింది?

కపాలి:—కలుకుట్లు దాసిలో నుండుటచే కుక్క గాని, శాక్యభిక్షువుగాని యెత్తుకొనిపోయి యుండ వచ్చు ననుకొందును.

దేవసోమ:—అయితే దాన్ని పట్టుకోవడానికి కాంచీపురమంతా తిరుగుదాము.

కపాలి:—ప్రేయసీ! సరే.

(ఇర్వురుఁ బరిక్రమింతురు.)(అంతఁ బాత్రహస్తుఁడై శాక్యభిక్షువు ప్రవేశించును.)

శాక్యభిక్షువు:—అహో! ఉపాసకుడయిన ధన దాససెట్టిగారి సర్వావాస మహాదానమహిమ! ఆ మహాదాన మహిమచేత నాకు ఇష్టమైన రంగులతో ఇష్టమైన సువాసనలతో ఇష్టమైన రుచులతో నానా రకాలయిన మత్స్యమాంసాదుల వంటకాలు సాపడ గుదిరింది. ఇదుగో ఇప్పుడు రాజవిహారానికే పోతాను. ఆహా! పరమ కారుణికుడైన భగవంతుడు తథా గతుడు ప్రాసాదాలలో వాసము, చక్కగా పఱు పులు పఱచిన పట్టెమంచాలమీద పడక, జాము ప్రొద్దె క్కేటప్పటికే సాపాటు, మూడుజాములకు సురసా లయిన పానకాలు, జాజికాయ జాపత్రి యేలకులు లవం గాలు పచ్చకర్పూరము అని పంచసుగంధాలు గల తాంబూలము, సన్న పట్టుసెల్లా వస్త్రైవాటూ, ఉండ

వలె నసే ఉపదేశంచేత భిక్షుసంఘానికి మహోప కారం చేసికూడా ఇదేమిచెపుమా స్త్రీపరిగ్ర హము సురాపానము ఉండవలెనని గుర్తించలేక పోయినాడు. కాక ఆ సర్వజ్ఞుడు దీన్ని గుర్తించ లేక పోవడమేమిటి? నిశ్చయంగా చెడ్డముండ కొడుకు లీ ముదివయసు బుద్ధాచార్యులు మావంటి పడుచు వాళ్లమీద మాత్సర్యంచేత పిటక పుస్తకాలలో స్త్రీ సురాపాన విధానాలు తీసి పారవేసి ఉంటారనుకొం టాను. ఎక్కడ దొరకుతవి చెపుమా ఆ పిటకపుస్త కాలు సరియైన మూలపాఠాలతో; వాటిని గనక సంపాదిస్తినా సంపూర్ణమైన బుద్ధవచనాన్ని లోకంలో వెల్లడించి సంఘోపకారం జరిపినవాణ్ణౌతాను. (పరి క్రమించుచు.)

దేవసోమ:—సామీ! చూడు చూడు! అడుగో కాషాయ ధరుడు జనవత్తిడి కలిగిఉన్న రాచబాటలో ఒళ్లంతా కుంచించుకుని ఈపక్కా ఆపక్కా చూసు కుంటూ అడుగడుక్కూ అనుమానిస్తూ తొందరతొంద రగా వెళ్లుతున్నాడు.

కపాలి:—ప్రేయసీ! ఔనుసుమా! మఱియు వాని చేత ఏమిటో ఉన్నట్టుకూడ నున్నది. కాషాయమును పైఁగప్పిపెట్టినాఁడు.

దేవసోమ:—సామి! అయితే అడ్డం పోయి పట్టుకు పరిశీలింతాము.

కపాలి:—భవతి! అట్లే చేయుదము (చేరఁబోయి) ఓయి భిక్షూ! నిలు!

శాక్యభిక్షువు:—ఎవడు చెపుమా వీడు! నన్నిట్లా అంటాడు! (తిరిగి చూచి) వీడు ఏకామ్రవాసి దుష్ట కాపాలికుడా! కానీ; వీడి త్రాగుడుతబ్బిబ్బులలో తగులుకోకుండా తప్పించుకొంటాను. (వడిగా కడచి వెళ్లును.)

కపాలి:—ప్రేయసీ! అబ్బయ్య దొరకినది కపాలము! వీఁడు నన్నుఁ జూడఁగానే భయమెత్తి పర్వెత్తుచున్నాఁడు. ఆపరుగే సాక్షిసుమా వీఁడు అపహరించినాఁడనుటకు; (వడిగాఁ జేరఁబోయి ఎదుర్కొని అడ్డగించును.) ఓః! పొగరుఁబోతా! ఇంకెక్కడికోయి పర్వెత్తఁగలవు?

శాక్యభి:—కాపాలికోపాసక! తప్పుకో, తప్పుకో, ఏమిటిది? (ఆత్మగతము) బళే! అంగత్రైసుమా ఉపాసిక!

కపాలి:—ఓయిభిక్షూ! చూపవోయి! అదిగో నీ చేతిలో ఏమిటో కాషాయముచాటున కప్పబడి ఉన్నదీ, నేను చూడవలెను.

శాక్యభిక్షువు:—ఏమున్న దిక్కడ చూడడానికి? భిక్షాపాత్రగదా యిది!

కపాలి:—కనుకనే చూడవలసియున్నది.

శాక్యభిక్షువు:—ఆఁ! ఉపాసక! కూడదు కూడదు; దీన్ని చాటుపరుచుకొనే ఉంచుకోవలె మేము.

కపాలి:—అవును. ఇటువంటివాటిని చాటుపఱుచుకొనుటకే బుద్ధుఁడు మీకు బహు చీవర ధారణము నుపదేశించెను.

శాక్యభిక్షువు:—నిజమది;

కపాలి:—సరి! ఇదేమో సంవృతసత్యము. పరమార్థ సత్యమేదో పలుకుము.

శాక్య:—చాలు ఇంతటితో గేలి. అతిక్రమిస్తున్నది భిక్షావేళ; వెళ్లివస్తాను. (బయల్దేరును)

కపాలి:—ఆః! పోగరుఁబోత! ఎక్కడికేఁగెదవు? నా కపాలము నాకిమ్ము. (చీవరపుఁజెంగు పట్టుకొనును.)

శాక్య:—నమో బుద్ధాయ.

కపాలి:—'నమఃఖరపటాయ' అనవోయి! ఆయన గదా చౌరశాస్త్రకారుఁడు! కాక ఆ ఖరపటునికంటె ఈ యధికారమున బుద్ధుఁడే అధికుఁడు. ఏలనఁగా.

ఆ. ఉపనిషచ్చయమునుండి, మహాభార
తమున నుండి, యర్థతతి హరించి
విప్రు లరయుచుండనే ప్రతారణమునఁ
గోశసంచయమును గూర్చె నతఁడు.

శాక్యభిక్షువు:—శాంతం పాపం. శాంతం పాపం.

కపాలి:—ఈ విధముగా సద్వర్తనముగల తపస్వికి పాపము శాంతింపకేమాను ?

దేవసోమ:—సామీ ! బడలినట్లున్నారు మీరు ! ఈ కపాలం సులువుగా మనకు ఓపట్టాన వచ్చేటట్లు లేదు. కనుక ఈ గోవుకొమ్ముతో కల్లుతాగి బలం తెచ్చుకొని తర్వాత వీడితో తగవులాడుదురు గాని.

కపాలి:—అట్లే కానీ.

(దేవసోమ కపాలికి కల్లుత్రాగనిచ్చును.)

కపాలి:—(త్రాగి) ప్రేయసీ ! నీవుకూడ శ్రమాప నోదనము చేసికొమ్ము.

దేవసోమ:— సామీ! అట్లాగే. త్రాగును.

కపాలి:—ఈతఁడు మన కపకారి; అయినను, మనసిద్ధాంతమున సంవిభాగ ప్రదానము ముఖ్యమైయు న్నది. కనుక శేష మీ యాచార్యున కొసఁగుము.

దేవసోమ:—సామి సెలవుప్రకారము ; (భిక్షువునుజూచి) సామీ గ్రహించండి !

శాక్యభిక్షువు:—(ఆత్మగతము) బలే! అభ్యుదయము సులువుగా అబ్బింది. పదిమందీ చూస్తారనేది వొక్కటే చిక్కు. (ప్రకాశము) అమ్మా! ఆఁ! ఆఁ! అట్లా అనవద్దు. మా కిది తగదు. (సెలవులు నాకును)

దేవసోమ:—ఛీ, పో, దౌర్భాగ్యుడా! చావు, ఇలాగంటి భాగ్యం నీ కెట్లా లభిస్తుంది.

కపాలి:—ప్రేయసీ! వీనిమాటతీరు లోనికోరికతో విరోధించుచున్నది సుమా! సెలవులు తడియుచున్నవి చూచితివి గదా!

శాక్యభిక్షువు:—ఇప్పుడు కూడ నీకుఁ గరుణకలు గదా?

కపాలి:—కరుణయే కలుగునేని వీతరాగుఁడ నెట్లగుదును?

శాక్య:—అవును వీతరాగుడవూ కావలెను వీతరోషుడవూ కావలెను.

కపాలి:—వీతరోషుఁడ నగుదును. నా సొమ్ము నా కిచ్చివేసెదవేని.

శాక్య:— నీ సొమ్మేమిటి?

కపాలి:—కపాలము.

శాక్య:—కపాలమేమిటి?

కపాలి:—'కపాల మేమిటి' అనెదవా? అవును, అనకేమి?

ఉ. అప్పతి ధారుణీధర ధ
 రాద్యములైన మహాపదార్థముల్
గొప్పగ నెప్పుడుం గనుల
 కుం గనవచ్చుచునుండగానె తాఁ
దప్పు తలంపునంబడి త
 థాగతుఁ డెల్ల నపహ్నవించె నా
యప్పరుఁ బిడ్డ వె ల్లెఱుఁగ
 వల్పకపాల మపహ్నవింపఁగాఁ.

దేవసోమ:—సామీ! వట్టిదేవరింపు మాటలకు ఇచ్చేవాడుగాడువీడు. వీడి చేతిలోనుండి బలవంతాన ఊడ బెరుక్కు పోదాము.

కపాలి:—ప్రేయసీ! అంతే చేయుదము. (ఊడఁ బెఱుకుకొనుటకుఁ దంటాలుపడును.)

శాక్య:—చావు! కాపాలిక ముండ కొడక! (చేతితో తొలఁగద్రోచి, కాలితో తన్నును.)

కపాలి:—ఏమీ క్రిందఁ బడిపోయితినా?

దేవసోమ:—చచ్చావు! లంజెకొడక! (జుట్టు పట్టుకోఁబోయి అది దొరకక క్రిందఁబడును.)

శాక్య:—(ఆత్మగతము) భేషయినది బుద్ధుని విజ్ఞానము! బుఱ్ఱ బోడి చేయించుకొమ్మన్నాడు! (ప్రకాశము) లే! లే! ఉపాసికా లెమ్మ, (దేవ సోమను లేవఁదీయును.)

కపాలి:—చూడుండి చూడుండి! మాహేశ్వరులారా! భిక్షునామధారి దుర్మార్గుఁడీ నాగసేనుఁడు నా ప్రియురాలి పాణిగ్రహణము చేయుచున్నాఁడు!

శాక్య:—ఆఁ! ఆఁ! ఉపాసక! అదికాదు. అదికాదు. చిక్కులలో పడ్డవాళ్లమీద దయ దలచడం మా ధర్మంగాదా?

కపాలి:—ఇదికూడ సర్వజ్ఞ ధర్మమా! ఓయీ! నేను ముందుగాఁ క్రిందఁ బడితినిగదా! కానీ! ఎందుకిది యెల్ల? ఇప్పుడు నీ శిరఃకపాలము నాకు భిక్షాకపాలము కాఁగలదు.

(అందఱు కొట్లాడుదురు.)

శాక్య:—సర్వం దుఃఖం దుఃఖం.

కపాలి:—చూడుండయ్యా మాహేశ్వరులారా! చూడుండి! దుర్మార్గుఁడీ భిక్షునామధారకుఁడు నా భిక్షాకపాలమును దొంగిలించి పైఁగా తానే గోలుపెట్టుచున్నాఁడు! అవును గాక! నేనుగూడ మొఱ్ఱలిడెదను. కుయ్యో! నై అబ్జో! కుయ్యో! మొఱ్ఱో!

(అంతఁ బాశుపతుఁడు ప్రవేశించును.)

పాశుప:—సత్యసోమా! ఎందుకు ఏడ్చెదవు?

కపాలి:—ఓయి! బభ్రుకల్ప! దురాత్ముఁడు భిక్షునామధారకుఁడు వీఁడుగో నాగసేనుఁడు నాభిక్షాకపాలమును దొంగిలించి యియ్య నొల్లకున్నాఁడు.

పాశుపతుఁడు:—(ఆత్మగతము) మనము చేయఁదలఁచుకొన్న పని యదేదో! చెలఁగి దాని గంధర్వులే చేసినారు! ఈ దురాత్ముఁడు!

తే. చీవరాంతమ్మునన్ ముడిచికొని కాని
కానిపించుచు నా నేస్తకత్తెయైన,
క్షౌరికునిదాసిఁ దోఁకొని చనెడు నవుర!
పిడికిటన్ మేఁతఁజూపుచుఁదోడుకుఁ బోలె.

కనుక నిప్పుడు ఎదిరి పక్షము నెక్కొలిపి నా శత్రుపక్షమును ధ్వంసపఱుచుకొందును. (ప్రకాశము) ఓయి నాగసేన! ఈతఁ డన్నది నిజమేనా?

శాక్య:—స్వామీ! మీరున్నూ ఇట్లా అంటారేమి? "అదత్తాదానమునుండి విరమణము శిక్షాపదము, మృషావాదమునుండి విరమణము శిక్షాపదము, అబ్రహ్మచర్యమునుండి విరమణము శిక్షాపదము, ప్రాణాతిపాతమునుండి విరమణము శిక్షాపదము, అకాలభోజనము

నుండి విరమణము శిక్షాపదము, మాకు; బుద్ధుణ్ణి బౌద్ధ ధర్మాన్ని, బౌద్ధసంఘాన్ని, శరణుచొస్తున్నాను''

పాశుప:—సత్యసోమా ! వీరి నియమ మిలాటిది. దీని కేమి బదులు పలికెదవు !

కపాలి:—మాకును అనృత మాడరాదని నియమము కలదు గదా !

పాశు:—అదీ ఇదీ ఉభయము వాస్తవమే. ఇక్కడ నిర్ణయోపాయమేది ?

శాక్య:—బుద్ధవాక్యాన్ని ప్రమాణీకరిస్తూ ఉన్న భిక్షువు సురాభాజనాన్ని దొంగిలిస్తాడనడానికి హేతు వేమిటి ?

పాశుప:—ప్రతిజ్ఞా మాత్రముచే హేతువాదికి కార్యసిద్ధి కలుగదుగదా !

కపాలి:—ప్రత్యక్షవిషయమున హేతువును జెప్పుట వ్యర్థము.

పాశుప:—ఏమి ? ప్రత్యక్షమేనా !

దేవసోమ:—స్వామీ ఇతగాడు చేతిలో చీవరము చాటున దాచిఉంచాడు కపాలాన్ని.

పాశుప:—వినుచున్నావటయ్యా?

శాక్య:—ఓ స్వామీ ! ఈ కపాలము పరకీయము కాదు.

కపాలి:— అట్లేని చూపవచ్చునుగదా!

శాక్య:—సరే.

కపాలి:—చూడుండి, చూడుండి, మహేశ్వరులారా! కాపాలికుఁడు చేసిన యన్యాయ్యమును, భదంతుని సౌశీల్యమును;

శాక్య:—అదత్తాదానమునుండి విరమణము శిక్షాపదము—(ఇత్యాదిపూర్వపఠితమును మరలఁ బఠించును)

(ఇద్దఱుఁ జిందులు ద్రొక్కుదురు.)

శాక్య:—అక్కా! లల్లా!! సిగ్గుపడవలసిన సందర్భంలో చిందులు ద్రొక్కుతున్నాడు!

కపాలి:—ఆఁ. ఎవఁడు నృత్యము చేయువాఁడు! (అంతటఁ జూచి) నష్టమైన నా భిక్షా భాజనమును మరలఁగనుఁగొనఁగలిగితి నన్న బులుపాటమను మలయమారుతము సోఁకఁగాఁ దలిర్చినది నా ప్రీతిలత. దానికి తొడిగిన మొగ్గతొడుగు నాకీ నృత్యబుద్ధి!

శాక్య:—స్వామీ! భిక్షాకపాలమిది కానరాక పోవడానికి కారణ మేమిటి? స్వామీ! దీని రంగేమిటో చెప్పవయ్యా!

కపాలి:—ఇఁక నిక్కడ చెప్పవలసిన దేమున్నది? నేను చూచితినిగదా కాకికంటె నల్లఁగానున్నదీ కపాలము.

శాక్య:—కనుక నిక నీ కపాలము నాదే యగుట స్వయముగానే సమ్మతమయింది. (అని చూపును.)

కపాలి:—నిజముగా స్పష్టమయినది నీకు రంగు మార్పు చేయుటలోఁ గల నేర్పు; కనుము.

తే. తొలుత వెలిదమ్మిలేఁదూండ్లతుండ్లవన్నె
సాజమై నీవుతాల్చు వస్త్రమున కలరె
దాని కిప్పుడు నీచేతఁ దారసిలదె
మొదలి యెఱసంజవన్నె యో మోసగాఁడ!

తే. మాయనికషాయమునలోన మఱి వెలుపల
గప్పఁబడిన నీ చేతిలోఁ జొప్పడెనట!
ఓయి భిక్షువా! యింకఁ గషాయితమ్మ
దేల కాకుండు నయ్య కపాలకమ్ము?

దేవసోమ:—అయ్యో! చెడ్డాను! దురదృష్టురాల్ని, సర్వలక్షణసంపన్నమైంది, బ్రహ్మపుఱ్ఱెవంటి మహిమగలది, పున్నమ చందమామను బోలింది; కల్లువాసనతో గమగమలాడుతూ ఉండేది, ఈ కపాలం మురికి గుడ్డల బిచ్చగాడిచేత బడి ఇట్లా పాడై పోయింది! అయ్యో! (ఏడ్చును.)

కపాలి:—ప్రేయసీ ! చాలు ! చాలు ! ఏడు వను, మరల పవిత్రము కాఁగలదు. శ్రుతి చెప్పుచున్నది ; మహనీయపదార్థములకు ప్రాయశ్చిత్తములచేఁ బాపములు తొలఁగునని.

ఉ. దీక్షితుఁడై మహావ్రత మి
దేకద పూని శశాంకమౌళి పా
పక్షయముం బొనర్చుకొనె
బ్రహ్మశిరంబును ద్రుంచియుం, సహ
స్రాక్షుఁడు బ్రహ్మపుత్త్రుఁ ద్రిశి
రస్సును జంపియుఁ దొంటిమాడ్కిఁగా
నక్షయ పుణ్యముం బడసె
యజ్ఞశతంబునఁ బాప మాఱఁగాఁ.

ఓయి ! బభ్రుకల్ప ! అంతేకాదా !

పాశు:—శాస్త్రసమ్మతము నీమాట.

శాక్య:—ఔనయ్యా ! నేను రంగువేశాను ; సరే, దీని సంస్థానపరిమాణమును నిర్మించినవెవరు ?

కపాలి:—మాయాసంతానసంభవులు గదా మీరు?

శాక్య:—ఎంతసేపని నీతో తంటాలు పడేది? పుచ్చుకోవయ్యా స్వామీ దీన్ని !

కపాలి:—ఔను బాగుగా నున్నది. బుద్ధుఁడు కూడ నిట్లే దానపారమితను బూరించెను.

శాక్య:—దీన్ని ఇట్లా ఇచ్చివేస్తే నాకిక శరణ మేమి ?

కపాలి:—బుద్ధ, ధర్మ, సంఘములు.

పాశు:—ఈ వ్యవహారముఁ దేల్చుట నాచేతఁ గాదు. కనుక నిఁక నధికారులదగ్గఱకు వెళ్లవలసినదే.

దేవసోమ:—సామీ! అలాగైతే ఈ కపాలాని కోదణ్ణం.

పాశుప:—ఏమని నీయభిప్రాయము ?

దేవసోమ:—ఇతగాడైతే, చక్కగా ఒక్క విహారంలోనే ఉండి భోగా లనుభవిస్తూ ఉంటాడు గనుక డబ్బంత వెనుక వేసుకు ఉంటాడు. వాళ్లు కోరినట్లు అధికార్లముఖాలమీద ఇంత విరజల్లగలడు. నాగతి ? పాముతోలూ బూడిదా, ఇదే విభవంగా ఉన్న దరిద్ర కాపాలికుణ్ణి పరిచరించే దరిద్రురాలికి నాకు ఉద్యోగుల కచేరీలలోకి పోవడానికైనా యోగ్యత ఉందా?

పాశు:—కాదు అట్లా కాదు.

గీ. సారగౌరవములు సజ్జానిసంభూతి
స్థిరత మృదుత సౌరు తీరు గల్గి

వారు ధర్మభరము వహియించుచున్నారు
స్తంభ చయము మేలి సౌధమట్లు.

కపాలి:—అదిసరే. న్యాయవృత్తి గలవానికి దేని వల్లను భయ ముండదు.

శాక్య:—స్వామీ ! నీవు ముందునడు.

పాశు:—మంచిది. (అందఱుఁ బరిక్రమింతురు.)

(అంతట ఉన్మత్తకుఁడు ప్రవేశించును.)

ఉన్మత్త:—ఇదుగో ఇదుగో పాడు కుక్క, కఱుకుట్లతో ఉన్న కపాలాన్ని నోట కరుచుకొని ఎత్తుకు పోతోంది. లంజెముండ కొడుక ! ఎక్కడికిపోతావు. ఇదిగో ఇప్పుడిది కపాలాన్ని పారవేశి నన్ను పీకడానికే ఎదురుగా దూకి వస్తోంది' ఇదిగో రాతితో దీని దంతాల్ని విరగ్గొడతాను. (రాతిని విసరును.) ఏమి కపాలాన్ని విడిచిపెట్టి పారిపోతున్నావు ? పిచ్చివెధవ ! పాడు కుక్క ! ఇటువంటి శౌర్యం పెట్టుకోనా నన్నెదిరించ వచ్చావు ? ఊరబండి యెక్కి ఆకాశాని కెగిరి సముద్రుడితో కూడా రావణుణ్ణి చావగొట్టి బలవంతాన ఇంద్రుడికొడుకును తిమింగిలాన్ని పట్టుకొంటినిగదా ! నాతోనా ? ఏమీ ! ఆముదపు చెట్టూ ! ఏమంటావు ! ఉత్త అబద్ధం ఉత్త

అబద్ధం అంటావూ ? ఇదుగో రోకలికి మల్లే వెడల్పై ఎ వేలాడే చేతులుగల కప్ప నాకు సాక్షి ! కాక ముల్లోకాలా వెల్లడి అయిన పరాక్రమం గల నాకు సాక్షులతో ఏమి పని ! ఇట్లా చేస్తాను. కుక్క నోటికి విడిచిన మాంసఖండాన్ని కొఱుక్కు తింటాను. హా హా ! చంపేస్తోంది నన్ను బాష్పం. చంపేస్తోంది .ఎవడు వీడు నన్ను కొడుతున్నాడు ! కొంటెకుంక ల్లారా ! నే నెవడికో ఓడికి మేనల్లుణ్ణి. భీమసేనుడికి ఖటోత్క. చుడి మల్లే. ఇంకా వినండి !

శూలాలు పట్టుకోని
చాలా వేషాల్ వేసికోని
వేల కొద్దీ పిశాచాలు
వెళ్తూ ఉంటై నా పొట్టన్,
పెద్దపుల్లూ వందలకొద్దీ
దద్దరిల్తూ ఉంటై నాతో
గద్దరి తాచుల్ చిఱ్ఱుల్ బుస్సుల్
కావిస్తుంటై నా నోట్లో.

ఏమీ నన్ను ఏడిపిస్తున్నారా? దయ తలచండి దయతలచండి కుఱ్ఱదొరల్లారా ! ఈ మాంసఖండం

కోసం నన్ను బాధించకండి ! (ముందుకుఁ జూచి) ఇదుగో మా ఆచార్లు కూరనంది ! ఈయన్ని చేర బోతాను.

పాశుపతుఁడు:—ఓహో! వీఁడుగో ఉన్మత్తకుఁడు ఇల్లై ఎదురు వచ్చుచున్నాఁడు.

సీ. చీకిరిబాకిరి చింపిరిమసిపాత
లట్టిట్టుగా మేనఁ జుట్టినాఁడు
కఱకులై చెడిన జుంజులు వెంట్రుకలు గోకి
బికి నెత్తిపైఁబోద వెట్టినాఁడు
బూడిదధూళితో వాడివీడిన పూల
దండలు ఱొమ్ముపైఁ దాల్చినాఁడు
కాపుకావనుచుఁ గాకములు పైఁ దిరిగిరా
నెంగిలాకులు చే వహించినాఁడు
ఊరిఁగ్రో రోఁతగొల్పెడు గోరములును
చెత్తచేదారములు నోఁకమొత్తమై వి
కారబీభత్స మానుషా కార మొందె
నేమొకోయన నున్నవాఁడిసిరో వీఁడు !

ఉన్మత్తకుఁడు:—ఈయన్ని చేరబోతాను. (చేరఁబోయి) మహాసాధువయిన చండాలపు కుక్కదగ్గ

ర్నాఁడి నాకు లభించిన యీ కపాలాన్ని స్వామి ప్రతిగ్రహించాలి!

పాశుపతుఁడు:—(దృష్టిక్షేపముతో) తగ్గవారికి అర్పింపుము.

ఉన్మత్త—(భిక్షువును చూచి) మహాబ్రాహ్మణ! అనుగ్రహించాలి!

శాక్యభిక్షువు:— ఈ మహా పాశుపతుడింమకుదగ్గవాడు.

ఉన్మత్త:—(కపాలిని చేరఁబోయి కపాలమును నేలమీఁదఁ బెట్టి ప్రదక్షిణించి పాదములపైఁ బడి) మహాదేవ! అనుగ్రహించాలి! ఇదిగో చేతులు జోడిస్తున్నాను.

కపాలి:—మాది కపాలము.

దేవసోమ:—అవును అంతే. ఇది మాదే.

కపాలి:—భగవత్పాదమువల్ల మరల నేను కపాలి నయితిని. (తీసికోఁ గోరును.)

ఉన్మత్త—లంజా కొడకా! విషం తిను. (కపాలమును గుంజుకొనిపోవును.)

కపాలి:—(వెంటాడి) ఈయములాఁడు నా ప్రాణము నెత్తుకొని పోవుచున్నాఁడు. అడ్డగించుఁడయ్యా మీ రిద్దఱున్ను.

ఉభయులు:—కానీ, మే మిద్దఱము నీకు సాయ మయ్యెదము. (అందఱు అడ్డగింతురు).

కపాలి:—ఓయి ! నిలు నిలు !

ఉన్మత్తకుఁడు:—ఎందుకు నన్నడ్డగిస్తారు !

కపాలి:—మాకపాలమును మాకిచ్చి వెడలుము.

ఉన్మత్తకుఁడు:—మొద్దూ ! కళ్లు కనపడడం లేదా! ఇది బంగారు గిన్నె కాదూ ! కపాలమంటావేమి !

కపాలి:—ఇటువంటి బంగరు గిన్నె నెవరు చేసిరి?

ఉన్మత్త:—వీడీ బంగారువన్నెబట్టలు కప్పుకొన్న బంగారు పనివాడు చేశాడనీ, స్వామీ ! యిది బంగారు గిన్నె అనీ విన్నవించుకొంటున్నాను.

శాక్య:—ఏమంటున్నావు ?

ఉన్మత్తకుడు:—బంగారుగిన్నె అంటున్నా.

శాక్య:—ఏమి యితడు పిచ్చివాడా ?

ఉన్మత్తకుడు:—పిచ్చివాడు పిచ్చివాఁడు అని చాలాసార్లీమాట వింటూ ఉంటాను. దీన్ని తీసుకొని పిచ్చివాణ్ణి చూపించు. (కపాలికి కపాలము నిచ్చును.)

కపాలి:—(కపాలము గైకొని) వీఁడిదిగో గోడ చాటయినాఁడు. శీఘ్రముగా రండి !

ఉన్మత్తకుడు:—లబ్ధప్రసాదు ణ్ణయినాను. (వడిగా ఉన్మత్తకుఁడు నిష్క్రమించెను.)

శాక్య:—అహో ! ఆశ్చర్యము ! పరపక్షమునకు లాభము కలుగుటచే నాకు పరితోషమయింది.

కపాలి:—(కపాలమును గాఁగిలించుకొని.)

మత్త. నే నఖండ తపంబొనర్చితి
నిక్కువంబ, మహేశ్వరుం
డానతప్రియుఁ డిచ్చ మెచ్చె న
హో! మహాద్భుతభక్తికిన్
కానరాక యెటో చనెన్ గద
కష్టుఁ డున్మదుఁ డక్కహా ?
ప్రాణతుల్యమ ! సేమమాయెఁ, క
పాలమా! నినుఁ గాంచితిన్.

దేవసోమ:—స్వామీ ! చంద్రుణ్ణి పొందిన ప్రదోషాన్నివలె మిమ్మల్ని చూచి నా చూపు ఆనందిస్తోంది!

పాశుపతుడు:—అదృష్టవంతుఁడవు ! వర్ధిల్లుము.

కపాలి:—మీదే సుమండి అభ్యుదయము !

పాశు:—(స్వగతము) సత్యము సుమా ! పాపము లేనిచోట భయముండదనుమాట; ఇప్పుడ భిక్షువు పులినోటనుండి బయటఁబడ్డాఁడు. (ప్రకాశము) ఇదిగో నే నిప్రుడే సుహృదభ్యుదయము కృతమయిన యానం

దయును బురస్కరించుకొని, పూర్వస్థలీ నివాసియగు భగవంతుని ధూమవేళను జూడఁ బోయెదను. నేఁడు మొదలుగా నింక నిదియును గుదురుగాక.

గీ. పెద్దతడవు మీఁదు నిద్దఱకును నేఁడు
తారసిల్లినట్టి వైర మిదియు
ప్రీతిరూపమై కిరాతార్జునులకును
బోలె శాశ్వతముగఁ బొలుచుఁగాక.

(పాశుపతుఁడు నిష్క్రమించెను.)

కపాలి:—ఓయి నాగసేన ! నేను అపరాధిని గాన నాయపరాధమును క్షమింప వలసినదిగా వేఁడుకొనుచున్నాను.

శాక్య:—ఇదికూడా కోరవలెనా ? ఇంకా నీకేమి ప్రియమో కోరుకో.

కపాలి:—స్వామికి నాపై ననుగ్రహము కలిగెనా? ఇంక నాకు వేఱ కోరఁదగిన దేది ?

శాక్య:— నే నింక వెళ్తాను.

కపాలి:—ప్రియా ! దేవసోమా ! మనమును వెళ్లుదము.

36—4

(భరతవాక్యము.)

ఉ. అన్వహమున్ ద్విజాళి నిగ
మాభ్యసనంబొనరించుతన్ హుతం
బు న్వహియించుతన్ బ్రజల
భూతికినై జ్వలనుండు, పాలచే
పు న్విడకుండ గోవు లెగు
పుం గనుతన్, గలకాల ముర్వి రా
జన్వతియౌత మీతి యుఱ
సౌఖ్యము వర్ధిల శత్రుమల్లుచేన్.

(Reprinted from "Chandrika" Jan. 1934)